## కేలండర్ ఆవిష్కరణ



కల్లుగీత కార్మిక సంఘం కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న బుర్ర వెంకటేశం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సర్వాయి సర్దార్ పాపన్న జీవన చిత్రాలను, గీత వృత్తిని ప్రతిబింబించేలా కల్లు గీత కార్మిక సంఘం కేలండర్‌ను రూపొందించారని విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం తెలిపారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో కల్లుగీత కార్మిక సంఘం కేలండర్‌ను బుర్ర వెంకటేశం ఆవిష్కరించారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు బుర్రా వెంకటేశంకు శుభాకాంక్షలు తెలపడంతో గీత కార్మికుల సమస్యలను వారి దృష్టికి తీసుకుపోయారు. కలుగీత వృత్తిలో ప్రమాదాలను నివారించాలని, ప్రమాదాలు జరిగిన వారికి కార్పొరేషన్ నుంచి డబ్బులు ఇప్పించాలని వారు కోరారు. ఉపాధ్యక్షులు వి.వెంకటనర్సయ్య, బోయపల్లి సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

చిక్కడపల్లి: నిరుద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని నిరుద్యోగుల ఉద్యమకారుడు డి.సలీమ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అనంతరం ఆయన చిక్కడపల్లిలో మాట్లాడుతూ... ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లను విడుదల చేయాలని కోరామన్నారు. నిరుద్యోగుల సమస్యలను వివరించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించాలన్నారు. కార్యక్రమంలో నేతలు మధు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ముషీరాబాద్‌లో ప్రొటోకాల్ వివాదం

- రూ. 25 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన
- నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానించకపోవడంపై బీజేపీ నేతల నిరసన



అడిక్‌మెట్‌లోని నమితా గ్రాండ్ వద్ద డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్ నమితా గ్రాండ్ వద్ద సుమారు రూ. 12 లక్షల అంచనా వ్యయంతో నిర్మింప తలపెట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్‌లను అభివృద్ధి చేస్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికలప్పుడే రాజకీయం అని ఎన్నికల అనంతరం అభివృద్ధి కోసం అన్ని రాజకీయ పార్టీలు కలిసి పని చేయాలని సూచించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు జీహెచ్‌ఎంసీ, జలమండలి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కావాల్సిన నిధులను విడుదల చేయిస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, అరుణ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, ముచ్చకుర్తి ప్రభాకర్, దీన్‌దయాల్‌రెడ్డి, పూస గోరఖ్‌నాథ్, ఎయిర్‌టెల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

> ముషీరాబాద్ నియోజవర్గంలో ఇటీవలి కాలంలో ప్రొటోకాల్ వివాదాలు చేటు చేసుకుంటున్నాయి. అభివృద్ధి పనులకు తమను ఆహ్వానించ లేదంటూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగుతున్నాయి. తాజాగా కేంద్ర మంత్రి నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు నిర్వహించిన శంకుస్థాపన కార్యక్రమానికి సికింద్రాబాద్ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఆహ్వానించ లేదంటూ బీజేపీ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు.

### శాస్త్రీనగర్‌లో...

ముషీరాబాద్ డివిజన్ శాస్త్రీనగర్‌లో రూ. 12 లక్షల వ్యయంతో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ సుప్రియ నవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు కొండపల్లి మాధవ్, సురేందర్, అనురాధ, డాక్టర్ విజయలక్ష్మి, శ్యామ్‌సుందర్, రవియాదవ్, సుబ్బారావు, ప్రేమలతారెడ్డి, ఖలీల్, అబ్బు తదితరులు పాల్గొన్నారు.

### కిషన్‌రెడ్డిని ఆహ్వానించకపోవడంపై బీజేపీ నేతల నిరసన



కిషన్‌రెడ్డిని ఆహ్వానించకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నేతలు

అడిక్‌మెట్, ముషీరాబాద్ డివిజన్‌లలో సుమారు రూ. 25 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు స్థానిక ఎంపీ, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆహ్వానించక పోవడంపై బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పనులను ప్రారంభించిన చోట ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గౌరీ శంకర్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు మాట్లాడుతూ... ఆయా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి కిషన్‌రెడ్డి చేత నిధులను మంజూరు చేయించామని తెలిపారు. అన్ని నిధులు మంజూరైన తరువాత ఎమ్మెల్యే వచ్చి పనులను ప్రారంభించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ప్రొటోకాల్ పాటించడం లేదని విమర్శించారు. భవిష్యత్తులో ఇలాగే జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. జలమండలి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, నేతలు లక్ష్మణ్‌రావు, డి.నర్సింగ్‌రావు, కిషోర్, సంఘం ప్రవీణ్, నాగరాజు, శ్రీకాంత్, దాసు తదితరులు పాల్గొన్నారు.

## రేపు 'నగర సంకీర్తనం'

నల్లకుంట: దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ సమర్పణలో శనివారం 'నగర సంకీర్తనం' కార్యక్రమం ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఉషాజ్యోతిర్మణి తెలిపారు. ఉదయం 6 గంటలకు కళాశాల ప్రాంగణంలో కార్యక్రమం ప్రారంభమై 8 గంటలకు డీడీ కాలనీలోని అహోబిల మఠంకు చేరుకుంటుందని, దీంతో సంగీత యజ్ఞం ముగుస్తుందన్నారు. పవిత్ర మార్గశిర మాసంలో మార్గం ద్వారా నామ సంకీర్తనం నగర సంకీర్తనంగా మలచాలనే ఆలోచనతో మా కళాశాల ముందుకు వచ్చిందని చెప్పారు. సంగీతాభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని నగర సంకీర్తన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉషాజ్యోతిర్మణి కోరారు.

## మహిళలకు ఉపాధి అవకాశాలపై ఉచిత శిక్షణ



మహిళలతో ఫౌండేషన్ చైర్‌పర్సన్ కావ్య కిషన్‌రెడ్డి

కాచిగూడ: మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నామని అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ చైర్ పర్సన్, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి భార్య జి.కావ్య కిషన్‌రెడ్డి తెలిపారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బర్కత్‌పురా, అంబర్‌పేటలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. సెంటర్ కో ఆర్డినేటర్ నీరజ, అనురాధ, సద్గుణ, వనజ, రేణుక, ఉషా మయూరి, సునిత తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి

నల్లకుంట: రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని మాజీ మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు సి.కృష్ణయాదవ్ కోరారు. గురువారం నల్లకుంట డివిజన్‌లోని ఆయా బస్తీలలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన సెంటర్లను స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీలకు సంబంధించి దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో మాట్లాడి దరఖాస్తులు సమర్పించడంలో ఏమైనా సమస్యలు తలెత్తుతున్నాయా, దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పథకాల కోసం దళారులను నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కె.జె.బాబు, సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎం.బి.కిశోర్ కుమార్, హైదరాబాద్ సెంట్రల్ ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్‌కుమార్, నాయకుడు భాస్కర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



బర్కత్‌పురాలోని బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవరచుకుంటే మానసిక ప్రశాంతత చేకూరుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం బర్కత్‌పురాలోని బ్రహ్మకుమారీస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కాలేరు పద్మ దంపతులు సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... భక్తిభావంతో పుణ్యఫలం లభిస్తుందని, ఎన్ని పనులున్నా భగవంతుని సన్నిధిలో కాసేపు గడపడానికి సమయాన్ని కేటాయించాలని సూచించారు. మనిషి ఆనందంగా ఉండటానికి జ్ఞానం అవసరమని, అది ఉంటేనే ఎల్లవేళలా సంతోషంగా ఉంటారన్నారు. జ్ఞానాన్ని సముపార్జించుకోవడంతో పాటు బాంధవ్యాలను పెంపొందించుకోవాలన్నారు. సృష్టిలో మానవ జన్మ చాలా గొప్పదని, అందుకు ప్రతిక్షణం సత్యాన్వేషణ కోసం తపించాలన్నారు. జనహిత కార్యాలు చేయడంతో పాటు భగవంతుని నామస్మరణ చేయాలని హితబోధ చేశారు. బ్రహ్మకుమారీ కేంద్రం ప్రజలకు అందిస్తున్న సేవలు చాలా బాగున్నాయని ప్రశంసించారు.

## ప్రజాపాలన గడువు పెంచాలి

ముషీరాబాద్: ఐదు గ్యారంటీల కోసం నిర్వహిస్తున్న ప్రజాపాలన గడువును పొడిగించాలని బీఆర్‌ఎస్ గ్రేటర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెల్లరేషన్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## అయోధ్యలో రామ మందిరం హిందువులకు గర్వకారణం



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి హనుమంతుని ప్రతిమను అందజేస్తున్న శ్రీనివాస్‌స్వామి

చిక్కడపల్లి: అయోధ్యలో అద్భుతమైన రామ మందిరం నిర్మాణం హిందువులకు గర్వకారణమని ఎంఎస్ రామారావు మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్ స్వామి అన్నారు. రామమందిరం నిర్మాణం నేపథ్యంలో గురువారం డాక్టర్ శ్రీనివాస్ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలసి హనుమంతుని ప్రతిమను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కోట్లాది మంది హింతూభక్తుల శ్రీరాముని మందిరమైన అయోధ్యలోని శ్రీరామ మందిరం ప్రపంచ చరిత్రలోనే ఒక గొప్పదని కోటానుకోట్ల హిందువుల భక్తి భావనలను నేరవేర్చిన ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్‌షా, యూపీ సీఎం యోగిలను, హిందూ ధార్మిక సంఘాలను, కరసేవకులు ఎప్పటికీ మరిచిపోరని శ్రీనివాస్ స్వామి అన్నారు.

## వేడుకగా అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న పూస రాజు, శివాజీ...

ముషీరాబాద్: బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ ఆధ్వర్యంలో 28వ అయ్యప్ప మహాపడి పూజ గురువారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్ నగర్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అయ్యప్ప భక్తిగీతాలను ఆలపిస్తు పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్రం అయ్యప్ప స్వామిని పల్లకిలో ఊరేగించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్, ముఠా జైసింహ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ నాయకులు పూస రాజు, కార్పొరేటర్లు సుప్రియ నవీన్‌గౌడ్, పావని వినయ్‌కుమార్, సదానంద్ ముదిరాజ్, శివాజీ, లక్ష్మణ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట్: నియోజకవర్గంలో దశలవారీగా పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకీకరించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. గురువారం గోల్నాక డివిజన్ గోవింద్‌నగర్‌లో రూ. 29.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించామని కాలేరు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జలమండలి అధికారులతో పాటు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షుడిగా డాక్టర్ మురళీధరుడు



డాక్టర్ మురళీధరుడిని అభినందిస్తున్న సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షుడిగా డాక్టర్ మురళీధరుడు, కార్యదర్శిగా శ్రీ అల్లాడి శ్రీనివాస్, ట్రెజరర్‌గా కోనేరు జైహింద్, చీఫ్ అడ్వైజర్‌గా ఎ.రామలింగేశ్వర్‌రావు ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కమిటీ సభ్యులుగా వెంకట్, డాక్టర్ నీల శ్రీధర్, విశ్వనాథశాస్త్రీ, మారం సురేష్‌బాబు తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ లింగ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల పనులను సత్వరమే పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని తదితరులు

చిక్కడపల్లి: రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలన్నారు. గురువారం మాధవరావులేన్, వీవీగిరినగర్, చిక్కడపల్లి, తదితర ప్రాంతాల్లో చేపడుతున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఏఈ అబ్దుల్ సలామ్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్, నేతలు నర్సింగరావు, ఎం.ఉమేష్, బి.భరత్, లక్ష్మణ్‌యాదవ్, సాయికుమార్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ హాస్టల్ మెస్ బిల్లులు విడుదల చేయాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

కాచిగూడ: పెండింగ్‌లో ఉన్న హాస్టల్ మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లకు రావలసిన బిల్లులను విడుదల చేయాలని అన్నారు. గత ఐదు నెలలుగా రూ. 5,485 కోట్లు పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను విడుదల చేయాలన్నారు. విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. చలికాలం కావున విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని, చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతున్నందున విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్, నాగేందర్, సహన, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలోనే ప్రజా సంక్షేమం



కృష్ణానగర్ ప్రజాపాలన సెంటర్‌లో మహ్మద్ అబ్దుల్ ఫరీద్

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ప్రజా సంక్షేమం, ప్రగతి, అభివృద్ధి, కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ ఫరీద్ అన్నారు. గురవారం కృష్ణానగర్ బస్తీలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన కేంద్రంలో ప్రజలకు ఆరు గ్యారంటీల దరఖాస్తు అభయ హస్తం దరఖాస్తులను ఆయన పంపిణీ చేశారు. ప్రజా పాలన ద్వారా వంద రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారంటీలను ప్రజలకు అందించి కాంగ్రెస్ పాలన చూపిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను తీసుకోవాలని సూచించారు. నేతలు ఉపేందర్, ఎ.నర్సింగ్ రావు, ఎ.కిషోర్, ఎ.బాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, ఉమేష్ బాబు, జి.వికాస్, ఎ.కిషోర్, వీరస్వామి, ఆరీఫ్, సయ్యద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# అంధుల అభ్యున్నతికి కృషి చేయాలి



లూయిస్ బ్రెయిలీకి నివాళులర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంధుల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఎన్‌పీఆర్‌డీ ప్రధాన కార్యదర్శి ఎం.అడివయ్య డిమాండ్ చేశారు. ప్రభుత్వ సమాచారాన్ని బ్రెయిలీ లిపిలో అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం చిక్కడపల్లిలోని ఎన్‌పీఆర్‌డీ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ... ప్రపంచంలోని అంధుల విద్య అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేసి ప్రత్యేక లిపిని కనిపెట్టి అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అన్నారు. బాల్యంలో అంధత్వం రాకుండా నివారించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంధుల కోసం ప్రత్యేకంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలని, సామూహిక ప్రాంతాల్లో బ్రెయిలీ లిపిని అందుబాటులో ఉంచాలని అన్ని రకాల అంధత్వం కలిగిన వారికి వైకల్య ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ప్రభుత్వ సమాచారం, జీవోలు, చట్టాలు బ్రెయిలీలో ముద్రించి అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. అంధులకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పీఆర్‌డీ కోశాధికారి ఆర్.వెంకటేష్, నాయకులు మహ్మద్ యూసుఫ్, వరప్రసాద్, రాజు, నర్సింగ్, ఉషా, విజయ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న శివభక్తి వైభవంపై ప్రవచనం



ప్రవచిస్తున్న ముదిగొండ శివప్రసాద్

చిక్కడపల్లి: మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాయగాన సభలో గురువారం రాత్రి శివ భక్తి వైభవంపై ప్రవచన ప్రసంగ కార్యక్రమం జరిగింది. చారిత్రక నవలా రచయిత ముదిగొండ శివప్రసాద్ శివతత్వంపై ప్రవచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భక్తి సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొలుత పేదలకు బియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రముఖులు దేవేందర్, రామ్మోహన్, గాంధీ, పద్మావతి, సీతమ్మ, స్వరూప, అనిత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం చెల్లించాలి



బుర్ర వెంకటేశంను సన్మానిస్తున్న కిషోర్‌కుమార్ తదితరులు

ముషీరాబాద్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న అతిథి అధ్యాపకులకు కనీస మూల వేతనం చెల్లించాలని, డిగ్రీ స్పాట్ వాల్యూయేషన్‌కు అనుమతించాలని తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు సి.హెచ్.కిషోర్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం అతిథి అధ్యాపకుల ప్రతినిధి బృందం ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డిలను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న ఎనిమిది మంది లెక్చరర్స్‌ను అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించినందుకు ముందుగా ప్రిన్సిపల్ సెక్రటరీ వెంకటేశంను శాలువాతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1940 మంది అతిథి అధ్యాపకులుగా గత 10–15 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరు ఎగ్జామినేషన్, నాక్ విధులు, కళాశాలల్లో అన్ని కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ కమిషనర్ కార్యాలయం అనుమతించిన బయోమెట్రిక్ హాజరు విధానం ద్వారా కళాశాలలో పూర్తి సమయం పని చేస్తున్నారని తెలిపారు. అటువంటి అతిథి అధ్యాపకులకు నిబంధనల ప్రకారం కనీస వేతనం కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టి విధంగా చెల్లించాలని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 1940 మంది కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే పది సంవత్సరాలుగా పేపర్ వ్యాల్యుయేషన్ చేసేందుకు అవకాశం ఇచ్చారని రెండు సంవత్సరాల నుంచి పేపర్ వాల్యుయేషన్‌కు అవకాశం ఇవ్వడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పేపర్ వాల్యుయేషన్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు.

# సమానత్వ సాధనే సావిత్రీబాయి లక్ష్యం



నివాళులర్పిస్తున్న సుజాత, స్కైల్యాబ్‌బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సమానత్వాన్ని సాధనే లక్ష్యంగా సావిత్రీబాయి పూలే విశేష కృషి చేశారని ప్రొఫెసర్ సూరెపల్లి సుజాత అన్నారు. గురువారం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ... అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించడమే సావిత్రీబాయికి అర్పించే ఘనమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, కేవీపీఎస్ నగర అధ్యక్షుడు ఎం.దశరథ్, నేతలు బి.సుబ్బారావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు యజమానులకు అందజేత



చిక్కడపల్లి: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను 15 రోజుల వ్యవధిలో పోలీసులు వాటి యజమానులకు అప్పగించిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. దాదాపు 29 ఫోన్‌లు ట్రేస్ చేసి యజమానులకు అందజేసి శభాష్ అనిపించుకున్నారు. గురువారం స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఫోన్‌లు పోగొట్టుకున్న 15 మందికి స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఏరుకొండ సీతయ్య యజమానులకు ఆయా ఫోన్‌లను అందజేశారు. ఫోన్‌లను ట్రేస్ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన క్రైమ్ కానిస్టేబుల్ ప్రశాంత్‌ను ఇన్‌స్పెక్టర్ అభినందించారు.